సాక్షి
రాజన్న సిరిసిల్ల
గురువారం ׀ 13 ׀ ఏప్రిల్ ׀ 2023



అన్నదానానికి రూ.లక్ష విరాళం

వేములవాడ: ఆలయ నిత్యాన్నదాన సత్రానికి స్థానిక వ్యాపారి తాటికొండ రాజయ్య కుటుంబ సభ్యులు రూ.లక్ష విరాళం ఇచ్చారు.



ఇఫ్తార్ విందు

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేటకు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు సయ్యద్ సాధిక్ ఆధ్వర్యంలో బుధవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు.

గరిష్టం/కనిష్టం
40.0/27.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. స్వల్పంగా వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. రాత్రి చలిగాలులు వీస్తాయి.

కోపం, ఆవేశం వచ్చినప్పుడు మౌనంగా ఉండడం ఉత్తమం
– మహ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
గురు 6.36	శుక్ర 4.34

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

జిల్లా స్థాయి అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు



ఎంపికైన క్రీడాకారులు

సిరిసిల్లఅర్బన్: జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాజీవ్‌నగర్‌లోని మినీస్టేడియంలో బుధవారం జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. అండర్ 16–20 విభాగంలోని పోటీల్లో 20 మంది ఉత్తమ ప్రతిభ కనబరిచారు. వీరిని వరంగల్‌లో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులకు అధ్యక్షుడు చిక్కాల రామారావు, ప్రధాన కార్యదర్శి బొజ్జ చంద్రశేఖర్ శుభాకాంక్షలు తెలిపారు. పీఈటీలు సాయికృష్ణ, రాజు పాల్గొన్నారు.

యారన్ సబ్సిడీ చెల్లించాలి



జౌళీ శాఖ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

సిరిసిల్లటౌన్: బతుకమ్మ చీరలకు సంబంధించి పవర్‌లూమ్ కార్మికులకు రావాల్సిన 10 శాతం యారన్ సబ్సిడీని ప్రభుత్వం అందజేయాలని సీఐటీయూ పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం చేనేత జౌళీ శాఖ ముందు ధర్నా నిర్వహించారు. నాయకులు మూశం రమేశ్, కోడం రమణ మాట్లాడుతూ మూడేళ్లుగా బతుకమ్మ చీరలకు సంబంధించి యారన్ సబ్సిడీ ఇంతవరకు అందజేయలేదన్నారు. 2020 నుంచి 2022 వరకు మూడేళ్లకు సంబంధించిన సబ్సిడీ అందజేయాలని కోరారు. ఈమేరకు ఏడీకి వినతిపత్రం అందజేశారు. గోవిందు లక్ష్మణ్, గుండు రమేశఖ, శ్రీపతి మునీందర్, సబ్బని చంద్రకాంత్, గణేశ్, రాజశేఖర్ ఉన్నారు.

జాతీయ కవి సమ్మేళనానికి ప్రభాకర్



ప్రభాకర్

గంభీరావుపేట(సిరిసిల్ల): పటాన్‌చెరువులో ఈనెల 30న నిర్వహించే తెలుగు –వెలుగు జాతీయ కవి సమ్మేళనానికి లింగన్నపేటకు చెందిన కవి తంగళ్లపల్లి ప్రభాకర్ ఎంపికయ్యారు. తాను రాసిన ఉగాది కవితకు సంకలనంలో చోటు లభించింది. సమ్మేళనంలో కవితాగానం చేయనున్నారు.

రంజిత్ కుటుంబానికి బండి సంజయ్ పరామర్శ



పరామర్శిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): విద్యార్థి ఉద్యమనేత, ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్‌కుమార్‌పై ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. రంజిత్‌కుమార్ కుటుంబ సభ్యులతో బుధవారం ఫోన్‌లో మాట్లాడారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. సంజయ్ పీఏ ప్రవీణ్‌రావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లగిశెట్టి శ్రీనివాస్‌లు రంజిత్‌కుమార్ కుటుంబాన్ని పరామర్శించి, మనోధైర్యం కల్పించారు. జిల్లా మహిళ మోర్చా అధ్యక్షురాలు బర్గం వెంకటలక్ష్మీ మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యలపై పోరాడుతున్న నాయకులను అక్రమంగా అరెస్టులు చేయడం దారుణమన్నారు. రంజిత్‌కుమార్‌ను జైలు నుంచి విడుదల చేయాలని కోరారు. పార్టీ మండలాధ్యక్షుడు పొన్నాల తిరుపతిరెడ్డి, జిల్లా కార్యదర్శి మద్దుల బుగ్గారెడ్డి, నాయకులు వెంకట్‌రెడ్డి, రాజిరెడ్డి, సత్యంరెడ్డి, బాపురెడ్డి, భాస్కర్ ఉన్నారు.

ఉద్యోగాలు సృష్టించే స్థాయికి ఎదగాలి

- జిల్లెల్ల వ్యవసాయ డిగ్రీ కాలేజీని పీజీ కాలేజీగా మార్చాలి
- ఇక్కడే అగ్రీహబ్ ఏర్పాటు
- వ్యవసాయ కాలేజీకి డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ పేరు
- కాలేజీ ప్రారంభోత్సవంలో మంత్రి కేటీఆర్



జిల్లెల్లలో కోల్డ్ స్టోరేజీని ప్రారంభిస్తున్న మంత్రులు, స్పీకర్



వ్యవసాయ కళాశాలను ప్రారంభిస్తున్న మంత్రులు

సిరిసిల్ల: విద్యార్థులు ఉద్యోగాలు సృష్టించే స్థాయికి ఎదగాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, మున్సిపల్‌శాఖ మంత్రి కె.తారక రామారావు కోరారు. తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల వద్ద 35 ఎకరాల్లో రూ.69.30 కోట్లతో నిర్మించిన ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని వ్యవసాయ డిగ్రీ కాలేజీని, హాస్టల్‌ను అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డిలతో కలిసి బుధవారం మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ దేశానికే దిశానిర్దేశం చేసే వ్యవసాయ శాస్త్రవేత్తలుగా జిల్లెల కళాశాల విద్యార్థులు తయారుకావాలని ఆకాంక్షించారు. జిల్లెల్లకు వస్తూ హెలికాప్టర్ నుంచి చూస్తే కొండపోచమ్మసాగర్, మల్లన్నసాగర్, రంగనాయకసాగర్, అన్నపూర్ణ రిజర్వాయర్, మిడ్‌మానేరులు నీళ్లతో కళకళలాడుతుంటే ఎంతో సంతోషం అనిపించిందన్నారు. జిల్లెల్ల డిగ్రీ కాలేజీని పీజీ కాలేజీగా మార్చాలని, శాటిలైట్ క్యాంపస్ మంజూరు చేయాలని మంత్రి కేటీఆర్ వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డిని కోరారు. జిల్లెల్ల వ్యవసాయ కళాశాలకు డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ కళాశాలగా నామకరణం చేస్తామన్నారు. రాష్ట్ర సచివాలయానికి డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ పేరును పెట్టుకున్నామని, ఆయన భారీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నామన్నారు.

అతిథులు ఏమన్నారంటే...

అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మన రాష్ట్రంలో పండిన ధాన్యమే పొరుగు రాష్ట్రాల్లోని కరువు ప్రాంతాల ప్రజలకు ఆహారంగా పంపిణీ అవుతుండడం మనందరికీ గర్వకారణమన్నారు. వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ తాను చదువుకునే రోజుల్లో సిరిసిల్ల, జగిత్యాల కల్లోలిత ప్రాంతాలుగా ఉండేవని ఇప్పుడు సస్యశ్యామలమైందన్నారు. ఒకే డిగ్రీ కాలేజీ ఉన్న ఈ ప్రాంతంలో ఇప్పుడు మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ, జేఎన్‌టీయూ, వ్యవసాయ పాలిటెక్నిక్, డిగ్రీ కాలేజీ రావడం ఈ ప్రాంత విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. సీఎం కేసీఆర్ అనుమతితో పీజీ కాలేజీని మంజూరు చేస్తామని ప్రకటించారు. ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ అరుణ, వేములవాడ ఎమ్మెల్యే డాక్టర్ చెన్నమనేని రమేశ్ బాబు మాట్లాడారు. సమావేశంలో ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్, ఎన్.ఖీమ్యానాయక్, రాష్ట్ర పవర్‌లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయిచంద్, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, మున్సిపల్ చైర్‌పర్సన్‌లు జిందం కళాచక్రపాణి, రామతీర్థపు మాధవి, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆకునూరి శంకరయ్య, రైతుబంధు సమితి అధ్యక్షుడు గడ్డం నర్సయ్య, ఆర్డీవో టి.శ్రీనివాస్‌రావు, కళాశాల ప్రిన్సిపాల్ ఉమామహేశ్వరి, జెడ్పీ సీఈవో గౌతమ్ రెడ్డి, డీపీవో రవీందర్, స్థానిక సర్పంచ్ మాట్ల మధు, కళాశాల అధ్యాకులు పాల్గొన్నారు.

మీ సేవకుడిని..



ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

ముస్తాబాద్(సిరిసిల్ల): 'పదిహేనేళ్ల క్రితం నేనెవరో మీకు తెలియదు.. కేసీఆర్ కొడుకుగా మీ ముందుకొచ్చిన నన్ను కడుపుల పెట్టుకుని చూసిన్రు. మీరు బువ్వ పెడితేనే నేను ఈ స్థాయికి వచ్చిన.. సీఎం కొడుకునైన నేను మీ సేవకుడినే..' అంటూ మంత్రి కేటీఆర్ భావోద్వేగంతో మాట్లాడారు. మద్దికుంటలో బుధవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ప్రసంగించారు. కేసీఆర్ నాయకత్వంలో కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమంతో దేశానికే మార్గదర్శకంగా నిలిచామన్నారు. దేశంలో 20 ఉత్తమ పంచాయతీలుంటే 19 గ్రామాలు తెలంగాణవేనని పేర్కొన్నారు. రైతుబంధు, రైతుబీమా, ఉచిత విద్యుత్, పింఛన్లు, కల్యాణలక్ష్మి, రుణమాఫీ, కేసీఆర్ కిట్లు వంటి ఎన్నో పథకాలు అమలు చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ఉద్యమంలో పోరాడిన కార్యకర్తలు, నాయకులకు అండగా ఉంటున్నామన్నారు. డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లు రాని వారికి గృహలక్ష్మి కింద రూ.3లక్షలు ఇస్తామని పేర్కొన్నారు.

సీఎంకు రుణపడి ఉంటాం

సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలతో తమ జీవితాలు బాగుపడ్డాయని పలువురు లబ్ధిదారులు వేదికపైకి వచ్చి మాట్లాడారు. తన భర్త అనారోగ్యంతో చనిపోతే రైతుబీమా ద్వారా వచ్చిన రూ.5లక్షలతో కుటుంబాన్ని పోషించుకుంటున్నట్లు అఫ్రాన తెలిపారు. ఏ ఆధారం లేని తనకు డబుల్‌బెడ్‌రూమ్ ఇల్లు, పింఛన్ ఇచ్చి ఆదుకున్నారని లక్ష్మి పేర్కొంది. అంతకుముందు మహిళలు బోనాలు, బతుకమ్మలతో మంత్రి కేటీఆర్‌కు స్వాగతం పలుకుతూ వేదికపైకి తీసుకొచ్చారు. ఖమ్మం జిల్లా వైరా మృతులకు నివాళి అర్పించారు. ఎమ్మెల్సీ సారయ్య, ఎంపీపీ శరత్‌రావు, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, ఆర్‌బీఎస్ అధ్యక్షుడు గోపాల్‌రావు, పీఏసీఎస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు సురేందర్‌రావు, విజయరామారావు, అక్కరాజు శ్రీనివాస్, నర్సింహారెడ్డి, యాదగిరి, సంతోష్‌రావు పాల్గొన్నారు.

నేనున్నానంటూ.. భరోసానిస్తూ..

'అమ్మా బాగున్నావా.. అక్క ఎలా ఉన్నావ్.. తమ్ముడు ఎలా ఉన్నావు..' అంటూ మంత్రి కేటీఆర్ ఆత్మీయ పలకరింపుతో నేనున్నానంటూ భరోసా కల్పించారు. పదకొండు గ్రామాల ప్రజలతో బీఆర్‌ఎస్ నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి కేటీఆర్ ఆయా గ్రామాల ప్రజల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక గ్యాలరీలకు వెళ్లి మాట్లాడారు. ఒక్కో గ్యాలరీలో పదిహేను నిమిషాల పాటు ఉండి వారి బాధలు విన్నారు. ఇదీ మన ప్రభుత్వమని.. మీకు తోడుగా ఉన్నానంటూ భరోసానిచ్చారు. ముస్తాబాద్, చిప్పలపల్లి, వెంకట్రావుపల్లె, బందనకల్, మోహినికుంట, మద్దికుంట, మొర్రాయిపల్లె, తెర్లుమద్ది గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు.

ప్రారంభోత్సవాలు.. పలకరింపులు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల శివారులో నిర్మించిన వ్యవసాయ కళాశాలకు మంత్రులు కేటీఆర్, నిరంజన్‌రెడ్డి, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఉదయం 10:20 గంటలకు హెలికాప్టర్ ద్వారా చేరుకున్నారు. అంతకుముందు హెలికాప్టర్ నుంచి ఏరియల్ వ్యూ ద్వారా కొండపోచమ్మసాగర్, మల్లన్నసాగర్ ప్రాజెక్టులను సందర్శించారు. కళాశాలకు చేరుకున్న మంత్రులు, స్పీకర్‌కు కలెక్టర్ అనురాగ్ జయంతి స్వాగతం పలికారు. ముందుగా కోల్డ్ స్టోరేజీ, ప్రాసెసింగ్ యూనిట్‌లను, తర్వాత వ్యవసాయ కళాశాల భవన సముదాయాన్ని ప్రారంభించారు. బహిరంగ సభ అనంతరం ఎన్ఆర్ఈజీఎస్ ఉద్యోగులతోపాటు మరికొందరు ఇచ్చిన వినతిపత్రాలను మంత్రి కేటీఆర్ స్వీకరించారు. కళాశాలలో భోజనం చేశారు. మధ్యాహ్నం 2:15 గంటలకు స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డితోపాటు వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి హెలికాప్టర్‌లో హైదరాబాద్ తిరుగుప్రయాణమయ్యారు. అనంతరం మంత్రి కేటీఆర్ జిల్లెల్లలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. జిల్లెల్ల సర్పంచ్ మాట్ల మధు, ఎంపీటీసీ చెన్నమనేని వెంకట్‌రావు, ఎంపీపీ పడిగెల మానస, జెడ్పీటీసీ పూర్మాని మంజుల, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, సింగిల్‌విండో చైర్మన్లు కోడూరి భాస్కర్‌గౌడ్, బండి దేవదాస్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, మహిళా అధ్యక్షురాలు మోర నిర్మల, ఏఎంసీ చైర్మన్ సింగిరెడ్డి రవీందర్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఎండీ తాజొద్దీన్, ఆర్ఎస్ఎస్ మండల కోఆర్డినేటర్ కొమ్మిటి రాజిరెడ్డి, తహసీల్దార్ పి.సదానందం, ఎంపీడీవో పి.లచ్చాలు, నేరెళ్ల పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ జిందం రేఖ తదితరులు పాల్గొన్నారు.





రాజన్న ఆదాయం రూ.36.22 లక్షలు

వేములవాడ: రాజన్న హుండీ ఆదాయాన్ని ఆలయ ఈవో కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో బుధవారం గుడి ఓపెన్ స్లాబ్‌లో లెక్కించారు. పోలీస్ బందోబస్తు, సీసీ కెమెరాల నిఘా మధ్య లెక్కింపు కొనసాగింది. చిల్లర నాణేలను లెక్కించారు. రూ.36.22 లక్షలు వచ్చినట్లు ఈవో తెలిపారు. ఏఈవోలు ప్రతాప నవీన్, బి.శ్రీనివాస్, జయకుమారి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ వెంచర్లలో హెచ్చరిక బోర్డులు



వేములవాడ అర్బన్: వేములవాడ మండలం మారుపాక శివారులోని అనుమతి లేని అక్రమ వెంచర్ల వద్ద గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో బుధవారం హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ లేఅవుట్ లేని అక్రమ వెంచర్ల వద్ద బోర్డులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అవుట్ ఉన్న వెంచర్లలోనే ప్లాట్లు కొనాలని సూచించారు.

రూ.500లకే గ్యాస్ సిలిండర్ ఇస్తాం

- డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్



మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

కోనరావుపేట (వేములవాడ): కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.500లకే సిలిండర్ అందజేసి, ఇల్లు నిర్మించుకునే వారికి రూ.5 లక్షల సాయం అందిస్తామని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ అన్నారు. మండలంలోని మంగళ్లపల్లిలో బుధవారం హాథ్ సే హాథ్ జోడోయాత్ర నిర్వహించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రజాసంక్షేమ కార్యక్రమాలు, పథకాలను నిర్వీర్యం చేస్తోందన్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే ఇందిరమ్మ భరోసా పథకం కింద ఏటా రూ.15 వేలు అందిస్తామని, రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల వరకు రుణమాఫీ అమలు చేస్తామన్నారు. కేంద్రం పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే తగ్గించాలన్నారు. సుద్దాల నుంచి మంగళ్లపల్లి వరకు తారు రోడ్డు పనులకు నిధులు మంజూరు చేసి, మూలవాగుపై వంతెనలు పూర్తి చేయాలని కోరారు. కిసాన్‌సెల్ జిల్లా అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా, జిల్లా కార్యదర్శి కచ్చకాయల ఎల్లయ్య, నాయకులు బాదవేణి బాలరాజు, నాయిని ప్రభాకర్‌రెడ్డి, భాస్కర్‌రావు, దేవయ్య, అవురం సురేశ్, లచ్చయ్య, పర్శ రాములు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

జంక్షన్‌లో నిఘా



- ఇది తిప్పాపూర్ బ్రిడ్జి వద్ద ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు. నంబర్‌ప్లేట్ లేని వాహనాలకు వంతెనపైకి అనుమతి లేదని హెచ్చరిస్తూ వేములవాడ పోలీసులు ఫ్లెక్సీ ఏర్పాటు చేశా రు. అంతేకాదు నిత్యం ట్రాఫిక్ ఎస్సై ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేస్తూ వాహనాలకు విధిగా నంబర్‌ప్లేట్ బిగించే వరకు వదలడం లేదు. ఇకపై హెల్మెట్ ధరించేలా చర్యలు తీసుకోనున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు.



- ఈ ఫొటో సిరిసిల్ల పాత బస్టాండ్. ఇక్కడ ట్రాఫిక్ నిబంధనలు పేర్కొంటూ ఎస్పీ అఖిల్ మహాజన్ ఫొటోతో కూడిన ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. వాహనాదారులు పాటించాల్సిన నిబంధనలు నిత్యం మైకులో ప్రచారం చేస్తున్నారు. హెల్మెట్ లేని వాహనదారుల ఫొటోలను తీసేలా కెమెరాలను ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసినప్పటికీ వినియోగంలోకి రాలేదు.

- ట్రాఫిక్ నిబంధనలు కఠినం
- నంబర్ లేని వాహనాలపై నజర్
- హెల్మెట్ ధరించడం తప్పనిసరి
- ఆటోమేటిక్ కెమెరాలతో జరిమానాలు





వేములవాడలో స్పీడ్‌గన్‌తో తనిఖీలు, సిరిసిల్ల కలెక్టరేట్ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

సిరిసిల్లక్రైం: రాజన్నసిరిసిల్ల జిల్లాలోని రెండు మున్సిపాలిటీలు సిరిసిల్ల, వేములవాడల్లో రోజురోజుకు ట్రాఫిక్ సమస్యలు పెరుగుతున్నాయి. వివిధ పనుల కోసం నిత్యం పట్టణాలకు వచ్చే వారి సంఖ్య పెరుగుతుండడంతో రోడ్లపై రద్దీ తీవ్రమవుతుంది. ఇదే సమయంలో వివిధ పనుల కోసం వచ్చే వారు సమయం తక్కువ ఉంటుందని.. అధికారులు ఉండరేమోనని ఆతృతలో వేగంగా వెళ్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల రెండు పట్టణాల్లో ప్రమాదాల సంఖ్య పెరిగిపోగా.. జనం సైతం ట్రాఫిక్ నిబంధనలు పాటించడం లేదు. ట్రాఫిక్ కష్టాలు తీర్చడంతోపాటు నిబంధనలు కఠినంగా అమలు చేసేందుకు జిల్లా పోలీసులు రంగంలోకి దిగారు. నంబర్‌ప్లేట్ లేని వాహనాలను పట్టుకొని జరిమానా విధిస్తున్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిని కెమెరాల సహాయంతో గుర్తించి ఆన్‌లైన్‌లోనే జరిమానాలు విధిస్తున్నారు.

అమలుకు చర్యలు

జిల్లాలో వాహన నిబంధనలను పక్కాగా అమలు చేసేందుకు పోలీసు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటి వరకు నిషేధిత ప్రాంతాలలో వాహనాల పార్కింగ్‌ను, అధిక వేగాన్ని నియంత్రించే చర్యలు తీసుకున్నారు. ఇప్పుడు ట్రాఫిక్ సిగ్నల్స్, సెల్‌ఫోన్ డ్రైవింగ్‌పై దృష్టి సారించారు. అంతేకాకుండా హెల్మెట్ ధరించాలన్న నిబంధనలు కఠినంగా అమలు చేయాలని నిర్ణయించారు. సిరిసిల్లతోపాటు రగుడుచౌరస్తా, అంబేద్కర్‌చౌరస్తా, కొత్తబస్టాండ్ జంక్షన్‌లలో హెల్మెట్ లేని వాహనాలను గుర్తించేందుకు కెమెరాలు ఏర్పాటు చేశారు. దీనికి అదనంగా నిత్యం సిరిసిల్లలో ట్రాఫిక్ ఎస్సై రాజుకుమార్, వేములవాడలో దిలీప్ ఆధ్వర్యంలో ప్రత్యేక వాహన తనిఖీలు చేపడుతున్నారు.

సౌకర్యాలు లేకుండానే జరిమానాలు

జిల్లాలో వాహనాలకు అనుగుణంగా పార్కింగ్ స్థలాలు లేవు. అయినా పోలీసులు రాంగ్ పార్కింగ్ అంటూ జరిమానాలు విధించడంపై ప్రజల నుంచి విమర్శలు వస్తున్నాయి. జంక్షన్‌లలో ఎక్కడి నుంచి ఎటువైపు వెళ్లాలనే సైన్‌బోర్డులను ఏర్పాటు చేయకుండా రాంగ్‌డ్రైవ్ అంటూ జరిమానాలు వేయడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. బైపాస్‌రోడ్లలో అతివేగం, డ్రంకెన్‌డ్రైవ్, హెల్మెట్ వంటి నిబంధనలు పటిష్టంగా అమలు చేయాలని, పట్టణంలోని రోడ్లపై కాస్త వెసులుబాటు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

నిబంధనలు అమలు చేస్తున్నాం



ట్రాఫిక్ నియంత్రణకు ఇప్పటి వరకు ఉన్న నిబంధనలే అమలు చేస్తున్నాం. వాహనదారుల క్షేమం కోసం చర్యలు తీసుకుంటున్నాం. జరిమానాలు లక్ష్యంగా ముందుకెళ్లే పరిస్థితి లేదు. హెల్మెట్ ధరిస్తే.. ప్రమాదం జరిగిన ప్రాణాపాయస్థితి నుంచి బయటపడే అవకాశాలు ఉంటాయి. హెల్మెట్ ధరించడం సామాజిక బాధ్యతగా భావించాలి.

– రాజు, ట్రాఫిక్ ఎస్సై, సిరిసిల్ల

పట్టణంలో వెసులుబాటు ఇవ్వాలి



పట్టణంలోని రోడ్లపై తిరిగే సమయంలో హెల్మెట్ ధరించే విషయంలో కాస్త సడలింపులు ఇవ్వాలి. కార్మికులు ఎక్సెల్ వాహనంపై చిన్న వస్తువు కోసం దగ్గరిలోని షాపునకు వెళ్లే మార్గంలో హెల్మెట్ ధరించడం కష్టం. రైతులు సైతం పట్టణానికి వచ్చి, వెళ్తుంటారు. పట్టణంలో కాస్త వెసులుబాటు ఇచ్చి, పట్టణ పరిధి దాటితే నిబంధనలు అమలు చేయాలి.

– నర్సయ్య, వాహనదారుడు, సిరిసిల్ల

జిల్లాలో వాహనాలు ఇలా..	
ద్విచక్రవాహనాలు	90,445
మోటార్‌క్యాబ్స్	835
ట్రాక్టర్‌లు	9,842
గూడ్స్ క్యారియర్స్	4,342
ఆటోలు	3,943
అంబులెన్స్‌లు	35

క్లుప్తంగా

పెండింగ్ బకాయిలను చెల్లించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్: మున్సిపల్‌లో పనిచేస్తున్న కార్మికులకు పెండింగ్ బకాయిలను చెల్లించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బుధవారం మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి కడారి రాములు మాట్లాడుతూ నిత్యావసర ధరలు పెరిగాయని, కార్మికులకు కుటుంబ పోషణ కష్టంగా మారిందన్నారు. ఉద్యోగులు, కార్మికులకు రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సామల మల్లేశం, అజ్జవేణు, తదితరులున్నారు.

నివాళి



స్వామి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి దేవయ్య

ముస్తాబాద్: మండలంలోని ఆవునూర్ మాజీ ఎంపీటీసీ బత్తుల స్వామి (53) గురువారం మృతిచెందారు. 1995లో ఎంపీటీసీగా పనిచేసిన ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. స్వామికి భార్య బాల్‌లక్ష్మి, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతదేహం వద్ద మాజీ మంత్రి సుద్దాల దేవయ్య నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. జెడ్పీటీసీ గుండం నర్సయ్య, సర్పంచ్ బద్ది కల్యాణి, ఎంపీటీసీ లలిత, పలు పార్టీల నాయకులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గం

గంభీరావుపేట : మండల ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షుడిగా పాపగారి యాదగిరి గౌడ్, గౌరవాధ్యక్షుడిగా ఎర్ర శ్రీనివాస్, అబ్దుల్ రహీం, ఉపాధ్యక్షుడిగా అరిగె రమేశ్, బొంగు మల్లేశం యాదవ్, ప్రధాన కార్యదర్శిగా గాండ్ల రవీందర్, సంయుక్త కార్యదర్శులుగా నరేశ్ చారి, సంతోష్ చారి, కార్యదర్శులుగా గుడికాడి శ్రీకాంత్, శంకర్, కోశాధికారిగా లింగారెడ్డి గారి శేఖర్ రెడ్డి, సలహాదారులుగా సయ్యద్ సాదత్ అలీ, రామస్వామిని ఎన్నుకున్నారు.

మరింత అభివృద్ధికి..

- 'న్యాక్' గుర్తింపు కోసం గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల సన్నద్ధం
- 20, 21 తేదీల్లో సందర్శించనున్న అధికారుల బృందం
- గుర్తింపు లభిస్తే కళాశాలకు మహర్దశ



గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల

గంభీరావుపేట (సిరిసిల్ల) : ఎంతోమంది విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా, ఉద్యోగస్తులుగా తీర్చిదిద్దిన గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉన్నత స్థానం(న్యాక్ గుర్తింపు) పొందడం కోసం సన్నద్ధమైంది. ఈనెల 20, 21 తేదీల్లో ముగ్గురు సభ్యులున్న న్యాక్ అధికారుల బృందం కళాశాలను సందర్శించనుంది. ఇందుకు కళాశాలలోని అన్ని విభాగాలకు మరిన్ని మెరుగులు దిద్దారు. ఉత్తమ గ్రేడ్ సాధనకు అవసరమైన అన్ని విభాగాల నివేదికను ఇంతకుముందే సమర్పించారు. వందలాది మందికి విద్యనందించి విభిన్న రంగాల్లో తీర్చిదిద్దిన చరిత్ర కలిగిన కళాశాలకు న్యాక్ గుర్తింపు లభిస్తే మహర్దశ రానుంది.

'న్యాక్' గుర్తింపు కోసం తొలి ప్రయత్నం..

మండలకేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల 2008లో ఏర్పాటైంది. న్యాక్ గుర్తింపుకోసం మొదటిసారిగా పోటీపడుతోంది. ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వ నిధులతో నిర్వహించబడుతున్న కళాశాల న్యాక్ గుర్తింపు పొందితే కళాశాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది. అధికారుల బృందం కళాశాలను సందర్శించనున్న నేపథ్యంలో ఎలాగైనా తొలి ప్రయత్నంలోనే ఉత్తమ గ్రేడ్ సాధించాలనే సంకల్పంతో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు కొన్ని నెలలుగా కష్టపడుతున్నారు.

కళాశాల నేపథ్యం..

పదిహేను ఏళ్లక్రితం కళాశాల ప్రారంభం కాగా అప్పట్లో ఒడిదొడుకుల మధ్య కొనసాగింది. 2021లో కళాశాలకు పక్కాభవనం, సదుపాయాలు సమకూరాయి. ప్రస్తుతం అన్నిరకాల సబ్జెక్టుల ల్యాబ్‌లు, సెమినార్ హాల్స్, లైబ్రరీ, కంప్యూటర్ డిజిటల్ ల్యాబ్‌లు తదితర సౌకర్యాలున్నాయి. ప్రస్తుతం 840 మంది విద్యార్థులు ఇక్కడ విద్యనభ్యసిస్తున్నారు. సైన్స్, ఆర్ట్స్, పీజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. మహిళా సాధికారత విభాగం, స్వయం ఉపాధి శిక్షణ విభాగం, వివిధ రకాల క్లబ్బులు, ఎన్ఎస్ఎస్, వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ, జిజ్ఞాస ప్రాజెక్టుల రూపకల్పనకు విభాగం తదితర ప్రత్యేక విభాగాలు కళాశాలలో కొనసాగుతున్నాయి.

సౌకర్యాలపై అభిప్రాయ సేకరణ

న్యాక్ బృందం అధికారులు కళాశాలలో నిర్వహిస్తున్న పలు అంశాలను పరిగణలోకి తీసుకుంటారు. విద్యావిధానం, కళాశాలలో సౌకర్యాలు, ఉపాధి అవకాశాలు, పూర్వ విద్యార్థులతో సమావేశమై అభిప్రాయ సేకరణ చేపట్టనున్నారు. విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించే కోర్సులు కొనసాగిస్తున్నారా లేదా అనేది పరిశీలిస్తారు. క్రీడలు, సామాజిక కార్యక్రమాల్లో విద్యార్థుల భాగస్వామ్యం గురించి తెలుసుకోనున్నారు.

అందరి సహకారంతోనే



అందరి సహకారంతోనే కళాశాలలో సౌకర్యాలు ఉన్నాయి. న్యాక్ గుర్తింపుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించాం. న్యాక్‌లో ఉన్నత స్థానం పొందితే కళాశాలకు మరిన్ని నిధులు మంజూరవుతాయి. విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. భవిష్యత్‌లో మరిన్ని ఉత్తమ కోర్సులుతో ఉపాధి అవకాశాలను సృష్టించే అవకాశం ఉంటుంది.

– ప్రొఫెసర్ వి. విజయలక్ష్మి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గంభీరావుపేట

మామూళ్ల పేరిట బెదిరింపులు..!



చందుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో పనుల ప్రారంభానికి తొలగించిన చెట్లు

- నిలిచిన పీహెచ్‌సీ పనులు
- పెచ్చులూడుతున్న భవనంలోనే విధులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

చందుర్తి (వేములవాడ) : మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన పనులు నిలిచిపోయాయి. అభివృద్ధి పనులు చేయాల్సిన ప్రజాప్రతినిధులే కాంట్రాక్టర్లను మామూళ్ల పేరిట బెదిరింపులకు పాల్పడడంతో సదరు కాంట్రాక్టర్ ఏకంగా పనులు నిలిపివేసినట్లు తెలిసింది. చందుర్తి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం శిథిలావస్థకు చేరడంతో ఎమ్మెల్యే రమేశ్‌బాబు సహకారంతో నూతన భవన నిర్మాణానికి రూ.1.56 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో భవన నిర్మాణానికి ఫిబ్రవరి 22న ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. పనులు చేసేందుకు కాంట్రాక్టర్ ముందుకొచ్చారు. పదిరోజుల క్రితం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆవరణలో అడ్డంగా ఉన్న చెట్లను తొలగించారు. పనులు మొదలుపెట్టారని తెలుసుకున్న స్థానిక ప్రజాప్రతినిధితోపాటు మండలస్థాయి ప్రజాప్రతినిధి మంజూరైన నిధుల్లోంచి పర్సంటేజీలు డిమాండ్ చేసినట్లు సమాచారం. సదరు ప్రజాప్రతినిధులు ఆస్పత్రి అభివృద్ధి కమిటీలోనూ ముఖ్యులు కావడంతో కాంట్రాక్టర్ ఏమీ చేయలేని పరిస్థితిలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఆస్పత్రి పాతభవనం పెచ్చులూడి కిందపడుతోంది. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని వైద్యసిబ్బంది భయం భయంగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని బీఆర్ఎస్ మండల నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

వర్మీ కంపోస్ట్‌తో అదనపు ఆదాయం

- జగిత్యాల కలెక్టర్ యాస్మిన్‌బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్‌బాషా

ధర్మపురి : వర్మీ కంపోస్ట్ ఎరువు తయారీని పెంచేందుకు కృషిచేయాలని, పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. మండలంలోని వివిధ గ్రామపంచాయతీల ఆధ్వర్యంలో తయారు చేసిన వర్మీ కంపోస్ట్ ఎరువు బ్యాగులను ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని ఉన్నతాధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి గ్రామ పంచాయతీలో ఈ విధానాన్ని పటిష్టంగా అమలు చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ వారిని అభినందించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మందమకరంద, డీఆర్డీవో, ధర్మపురి మండల ఎంపీవో, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

కాళ్లు తొలగించారు.. కనికరించండి

- కరోనా సోకి, షుగర్ లెవెల్స్ పెరగడంతో కాళ్ల తొలగింపు
- కుటుంబ పోషణ భారం
- లాక్ సిస్టం ఉన్న కాళ్లు అమర్చేందుకు రూ.6 లక్షలు అవసరం
- ఆపన్నహస్తం కోసం ప్రైవేట్ ఉపాధ్యాయుడి ఎదురుచూపు



కాళ్లు తొలగించడంతో మంచానికే పరిమితమైన రాంచందర్

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): 18 ఏళ్ల ఉపాధ్యాయ వృత్తిలో ఉండి, ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దిన ఆయన రెండు కాళ్లు కోల్పోయారు.. కుటుంబ పోషణకు, కృత్రిమ కా ళ్లు బిగించుకునేందుకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.. దాతలు కనికరించి, ఆపన్నహస్తం అందించాలని వేడుకుంటున్నారు. వివరాల్లోకి వెళ్తే.. యై టింక్లయిన్‌కాలనీకి చెందిన పడకంటి రాంచందర్ ఎంఏ తెలుగు చది వారు. కాలనీలోని షిర్కె బస్టాప్ ఏరియాలో గల శ్రీవాణి పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా, హెచ్‌ఎంగా 18 ఏళ్లు పని చేశారు. ఎంతో మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పారు. కరోనా సెకండ్ వేవ్ సమయంలో ఆయనకు వైరస్ సోకి, షుగర్ లెవెల్స్ పెరిగాయి. దీంతో రెండు కాళ్లలో రక్తం గడ్డ కట్టడంతో వైద్యులు ఆపరేషన్ చేసి, కాళ్లను తొలగించారు. అప్పటినుంచి మంచానికే పరిమితమయ్యారు. రెండు కాళ్లను మోకాళ్ల పైకి తీసివేయడంతో జైపూర్ ఆర్టిఫిషియల్ కాళ్లు పని చేయవని వైద్యులు తెలిపారు. లాక్ సిస్టం ఉన్న కాళ్లు మాత్రమే అమర్చాలని, వాటిని జర్మనీ లేదా అమెరికా నుంచి తెప్పించాల్సి ఉంటుందని, దాదాపు రూ.6 లక్షల వరకు ఖర్చవుతుందని చెప్పారు. దీనికితోడు రాంచందర్ పని చేయకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారింది. దీంతో ఆయన నిత్యం మనోవేదనకు గురవుతున్నారు. దాతలు తనను సోదరుడిగా భావించి, ఆర్థిక సాయం అందించి, ఆదుకోవాలని కోరుతున్నారు. సాయం చేయాలనుకునేవారు తన ఫోన్ నంబర్ 98493 74562కు గూగుల్ పే, ఫోన్ పే, పేటీయం ద్వారా చేయాలని వేడుకుంటున్నారు.

చికిత్స పొందుతూ యువతి మృతి



గుగులోతు లావణ్య (ఫైల్)

రుద్రంగి (వేములవాడ): మండలంలోని వీరునితండా గ్రామానికి చెందిన గుగులోతు లావణ్య (18) పురుగుల మందు తాగగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరా ప్రకారం.. చదువుకోవాలని తల్లిదండ్రులు మందలించడంతో మనస్తాపానికి గురై మంగళవారం పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం రుద్రంగికి, అక్కడి నుంచి ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి, తర్వాత సిరిసిల్లలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేశామని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై ప్రభాకర్ పేర్కొన్నారు.

మహిళ కడుపులోంచి కణతి తొలగింపు



కణతిని చూపుతున్న వైద్యురాలు

ముస్తాబాద్ (సిరిసిల్ల): అరుదైన శస్త్రచికిత్సతో ఓ మహిళ నుంచి ఐదుకిలోల కణతిని వైద్యులు తొలగించారు. గూడెం గ్రామానికి చెందిన సుబ్బమ్మ (40) కడుపునొప్పితో ముస్తాబాద్‌లో శ్రీ తిరుమల నర్సింగ్ హోంలో చేరింది. గురువారం శస్త్రచికిత్స చేసి ఆమె కడుపులోంచి ఐదు కిలోల కణతిని తొలగించినట్లు వైద్యురాలు అనూష తెలిపారు. వైద్యులు రవికాంత్, రాజేందర్ సబ్బమ్మకు ఆపరేషన్ చేసి ఐదు కిలోల కణితిని తొలగించారని చెప్పారు. దీనిని ఫైబ్రాయిడ్ యూటెరస్‌గా గుర్తించామని, ప్రస్తుతం సుబ్బమ్మ కోలుకుంటున్నట్లు తెలిపారు. మారుమూల పల్లెల్లోని ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తున్నామని పేర్కొన్నారు.

గుండెపోటుతో ప్రజా ఉద్యమకారుడి మృతి



లక్ష్మీనారాయణ (ఫైల్)

బుగ్గారం : మండల కేంద్రానికి చెందిన ప్రజా ఉద్యమకారుడు ఏలేశ్వరం లక్ష్మీనారాయణ (68) గుండెపోటుతో మృతిచెందారు. వడ్రంగి వృత్తి చేసుకుంటూ ఇంటివద్దనే జీవిస్తున్నాడు. బుధవారం గుండెపోటు రావడంతో హఠాన్మరణం చెందాడు. ఆయన మృతిపట్ల ప్ర ముఖ సామాజిక కార్యకర్త చుక్క గంగారెడ్డితో పాటు పలువురు ప్రజాసంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు సంతాపం తెలిపారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

గొల్లపల్లి: కుటుబం కలహాలతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై దత్తాద్రి తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన అనంతుల రాకేశ్ (30)కు మమతతో పదకొండేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కూతుళ్లు పవిత్ర, ప్రజావి ఉన్నారు. రాకేశ్ నాలుగేళ్ల క్రితం దుబాయికి వెళ్లాడు. ఆరునెలల క్రితం తిరిగి స్వగ్రామానికి వచ్చాడు. అప్పటినుంచి భార్యాభర్తలు గొడవపడుతున్నారు. మంగళవారం రాత్రి రాకేశ్ భార్యతో మరోసారి గొడవపడ్డాడు. భార్యను కత్తితో పొడిచి పారిపోయినట్లు సమాచారం. బుధవారం గ్రామ శివారులోని ఓ చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

జగిత్యాల క్రైం: జిల్లా కేంద్రంలోని జగిత్యాల–నిజామాబాద్ ప్రధాన రహదారిపై బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. జగిత్యాల రూరల్ మండలం.. చెల్‌గల్ గ్రామ శివారులోని ఓ హోటల్‌లో పనిచేస్తున్న సమీర్ అనే యువకుడు ద్విచక్రవాహనంపై పని నిమిత్తం జగిత్యాలకు వచ్చి చల్‌గల్‌కు వెళ్తున్నాడు. స్వప్న దాబా సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో సమీర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108లో జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్‌కు తరలించారు.

గీత కార్మికుడికి గాయాలు

సుల్తానాబాద్ రూరల్(పెద్దపల్లి): తాటిచెట్టు పైనుంచి పడి, ఓ గీత కార్మికుడికి గాయాలయ్యాయి. మండలంలోని నారాయణరావుపల్లికి చెందిన ఇల్లందుల సంపత్ రోజూ మాదిరిగా బుధవారం తాటి చెట్టు ఎక్కుతుండగా జారి పడ్డాడు. అతనికి గాయాలవగా సర్పంచ్ వెంకటలక్ష్మి, వార్డు సభ్యులు గుర్రం మల్లేశం, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు మొలుగూరి ప్రశాంత్, నాయకులు కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

భానుడి భగభగ..



నిర్మానుష్యంగా వేములవాడ పట్టణంలోని విద్యానగర్ కాలనీ

వేములవాడ : రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. పనుల నిమిత్తం బయటకు వెళ్లాలంటే ప్రజలు భయపడుతున్నారు. బుధవారం వేములవాడలో 41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడంతో పట్టణంలోని కాలనీలు, రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. శీతల పానీయాలతో ఉపశమనం పొందుతున్నారు. పట్టణంలో చాలామంది చల్లని తాగునీటి కోసం రంజన్లను కొనుగోలు చేయడం కనిపించింది.

వెంకటరాయిని చెరువు రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న జంగం అంజయ్య

వీర్నపల్లి (సిరిసిల్ల): వీర్నపల్లి మండల కేంద్రంలోని వెంకటరాయిని చెరువు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ జిల్లా రైతుసంఘం కార్యదర్శి జంగం అంజయ్య అన్నారు. సుమారు 80 కుటుంబాలు గత ఐదేళ్లుగా చెరువులో నీరు ఉండడంతో పంటలు పండించకపోవడంతో ఆర్థికంగా నష్టపోయినట్లు తెలిపారు. ప్రతి రైతుకు ఎకరానికి రూ.40 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేవారు. వెంకటరాయిని చెరువు రైతులను వెంటనే ఆదుకోవాలని మంత్రి కేటీఆర్‌ను కోరుతున్నామన్నారు. లేకపోతే పెద్దఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాట్ల అశోక్, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

కేసు నమోదు

సారంగాపూర్ : మండలంలోని బట్టపల్లి గ్రామ శివారులోని క్రీడాప్రాంగణ బోర్డును గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై మనోహర్‌రావు తెలిపారు. కార్యదర్శి మహేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, ధ్వంసం చేసిన వారి వివరాలు సేకరిస్తున్నామని తెలిపారు.

ట్రాన్స్‌కో ఉద్యోగి రిమాండ్

హుజూరాబాద్‌రూరల్: ఓ మహిళను వేధించిన ట్రాన్స్‌కో ఉద్యోగిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. వారి వివరాల ప్రకారం.. గోదావరిఖనికి చెందిన మహిళ గత కొంతకాలంగా హుజూరాబాద్‌లో టైలరింగ్ చేస్తూ జీవిస్తోంది. ఈ క్రమంలో పెద్దపాపయ్యపల్లి గ్రామానికి చెందిన ట్రాన్స్‌కో ఉద్యోగి ఎండీ.షాబుద్దీన్‌తో ఆమెకు పరిచయం ఏర్పడింది. షాబుద్దీన్ ఆమెకు మాయమాటలు చెప్పి, పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడు. అంతేకాకుండా సదరు మహిళ స్నానం చేస్తుండగా, రాత్రివేళల్లో వీడియోలు, ఫొటోలు తీశాడు. వాటిని సోషల్ మీడియాలో పెడతానని బ్లాక్ మెయిల్ చేసి, ఆమె వద్ద ఉన్న డబ్బులు తీసుకున్నాడు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. బుధవారం షాబుద్దీన్‌ను అరెస్టు చేసి, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. జడ్జి ఎదుట హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు ఎస్సై రాజన్న తెలిపారు.

వంతెనలకు మోక్షం

- మర్రిపల్లి వద్ద రూ.2 కోట్లతో కొనసాగుతున్న పనులు
- శాత్రాజుపల్లి – మల్లారం హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.6.75 కోట్లు మంజూరు
- తొలగనున్న వాహనదారుల కష్టాలు



శాత్రాజుపల్లి హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే రమేశ్‌బాబు (ఫైల్)

వేములవాడ రూరల్ : నియోజకవర్గానికి వెళ్లాలంటే వర్షాకాలంలో గ్రామీణ, మండలాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ప్రధానంగా వేములవాడ గంజివాగు, శాత్రాజుపల్లి వద్ద ఉన్న కల్వర్టు, మర్రిపల్లి వద్ద ఉన్న కల్వర్టులతో ప్రజలు అవస్థలు పడేవారు. వర్షపు నీటితో ప్రతి సంవత్సరం ఈ ప్రాంతం గుండా వాహనాల రాకపోకలు కొన్నిగంటలు నిలిచిపోయేవి. కాగా కల్వర్టులను హైలెవల్ బ్రిడ్జిలు నిర్మించేందుకు ఎమ్మెల్యే రమేశ్‌బాబు ప్రత్యేక నిధులు మంజూరు చేయించి ఈనెల 6న భూమిపూజ చేశారు. ఇప్పటికే మర్రిపల్లి వద్ద రూ. 2కోట్లతో హైలెవల్ బ్రిడ్జి పనులు జరుగుతున్నాయి. శాత్రాజుపల్లి, మల్లారంకు వెళ్లే రోడ్డులో ఉన్న హైలెవల్ బ్రిడ్జిలను నిర్మించేందుకు రూ.6.75 కోట్లతో పనులను ప్రారంభించారు. ప్రధానంగా పట్టణ ప్రధాన రోడ్లగుండా వెళ్లే వాహనదారుల ఇబ్బందులు తొలగనుండటంతో హర్షం వ్యక్తంచేస్తున్నారు.

కష్టాలు తొలగుతాయి



శాత్రాజుపల్లి వద్ద ఉన్న కల్వర్టు వద్ద వర్షాకాలంలో రాకపోకలు నిలిచిపోయేవి. కల్వర్టు పైనుంచి నీరు వెళ్తుండటంతో జగిత్యాల నుంచి వేములవాడకు వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడేవారు. హైలెవల్ బ్రిడ్జి నిర్మాణంతో కష్టాలు తొలగనున్నాయి.

– అన్నాడి రాజిరెడ్డి, రైతు, వేములవాడ

ఆనందంగా ఉంది



ఎన్నో ఏళ్లుగా ప్రయాణికులు కల్వర్టు వద్ద ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వాలు సమస్యను పట్టించుకోలేదు. ఎమ్మెల్యే రమేశ్‌బాబు ప్రత్యేక చొరవతో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు చేయడం ఆనందంగా ఉంది.

– కట్కం మల్లేశం, సర్పంచ్, మర్రిపల్లి